అభివృద్ధి పనులకు రూ. 2.5 కోట్లు మంజూరు


మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

బండ్లగూడ: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి నిధులను మంజూరు చేసి అభివృద్ధి పనులను చేయిస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లోని రాధానగర్, పద్మశ్రీహిల్స్ కాలనీ, పీఎన్‌టీ బి–బ్లాక్, డాక్టర్ కాలనీలో అత్యవసర పనులకు డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం కోసం అంగీకారం తెలుపుతూ రూ. 2.5 కోట్ల నిధులను కేటాయించామన్నారు. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాన్ని కార్పొరేషన్ నాయకులకు ఆయన అందజేశారు. నేతలు మహేందర్‌గౌడ్, సురేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, పాపయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలి


ఏఈకి వినతిపత్రం ఇస్తున్న సురేష్‌గౌడ్

బండ్లగూడ: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సురేష్‌గౌడ్ కోరారు. గురువారం కిస్మత్‌పూర్ ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ఏఈ మల్లేష్‌రాజ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధిక లోడ్ కారణంగా తరచు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను దిమ్మెలపై ఏర్పాటు చేయాలన్నారు. లైన్‌మెన్ సత్యనారాయణ, కాలనీ నేతలు స్వామి, గోవిందునాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకుంటతండాను ముంచెత్తిన వరద


ఎర్రకుంటతండాలో ప్రవహిస్తున్న వరదనీరు

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. చెరువులు, కుంటలు అలుగు పారాయి. ఎర్రకుంటతండాను వరద నీరు ముంచెత్తింది. ఇళ్లలోకి నీరు రావడంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షాకాలంలో తండాలోకి వరద రావడం ఇది రెండోసారి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


శంషాబాద్: పట్టణంలోని ఫ్లైఓవర్ కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ అశోక్ వర్మ సమాచారం మేరకు... పట్టణంలోని మసీదు సమీపంలో ఫ్లై ఓవర్ కింద నలభై ఏళ్ల వ్యక్తి మృతిచెంది ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఆర్‌జీఐఏ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

మైలార్‌దేవ్‌పల్లిలో వృద్ధుడు...


మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం లభ్యమైంది. పోలీసుల సమాచారం మేరకు... దుర్గానగర్‌లోని వైష్ణవి వైన్స్ షాప్ పర్మిట్ రూమ్ వద్ద ఒక వ్యక్తి వయస్సు 60–65 మద్యం తాగుతూ కిందపడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా అతిగా మద్యం తాగడం వల్ల గానీ మరేమైనా అనారోగ్యంతోగాని మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీతులు ఫోన్స్: 87125 68230, 94906 17459లలో సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న నిరసన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గురువారం విద్యార్థి సంఘం నిరసనలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో హెచ్‌సీయూ ప్రధాన గేటు మూసివేయడంతో విద్యార్థులు ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. ముఖ్యంగా విద్యార్థి యూనియన్‌ను రద్దు నిర్ణయాన్ని యూనివర్సిటీ ఉపసంహరించుకోవాలన్నారు. నాలుగు డిమాండ్లను అంగీకరించే వరకు నిరసన కొనసాగుతుందన్నారు.


ఆగిన అలకాపూర్ నుంచి బీఆర్‌సీ రోడ్డుకు కలవాల్సిన లింక్ రోడ్డు పనులు


ఔటర్ వరకు పూర్తి కాని రేడియల్ రోడ్డు–5 పనులు


రోడ్లు సరిపోక మణికొండలో నిత్యం ట్రాఫిక్ జాంలు

కలవని రోడ్ల 'లింకు'లు..

మణికొండలో తీరని ట్రాఫిక్ కష్టాలు..!

- ట్రాఫిక్ చక్రబంధంలో మణికొండ
- చోద్యం చూస్తున్న హెచ్‌ఎండీఏ
- పనులు ప్రారంభించని మున్సిపాలిటీ
- నిత్యం ఇబ్బంది పడుతున్న వాహనదారులు

మణికొండ: నిత్యం పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల నివారణలో భాగంగా ప్రభుత్వ రంగ శాఖలు రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్ల నిర్మాణం, ట్రాఫిక్ సిగ్నల్‌లను ఏర్పాటు చేయాలి. అందుకు అవసరమైన ప్రణాళికలు చేసి సంవత్సరాలు గడుస్తున్నా వాటిని ఆచరణలోకి తేకపోవటంతో మణకొండ మున్సిపాలిటీ ప్రజలు నిత్యం ట్రాఫిక్ కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా, బయట నుంచి ఇంటికి రావాలన్నా గంటల సమయం ట్రాఫిక్ చక్రవ్యూహాల్లో ఇరుక్కుపోవాల్సిన పరిస్థితులు నెలకొటున్నాయి. ఇప్పటికే పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించ లేకపోయినా ప్రతి సంవత్సరం ఇబ్బడిముబ్బడిగా నిర్మాణాలకు అనుమతులు జారీ చేసి కోట్లాది రూపాయలను మూట కట్టుకుంటున్నారు. దశాబ్దం క్రితం వేసిన మాస్టర్ ప్లాన్‌లు, సంవత్సరాల క్రితం మొదలు పెట్టిన పనులు పూర్తి కాక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

అందరికీ వినతులు...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు చేపట్టాల్సిన రోడ్ల అవసరాన్ని వివరిస్తూ సంబంధిత శాఖల మంత్రులకు, ముఖ్యమంత్రి వరకు మొరపెట్టుకున్నా వారి నుంచి సరైన స్పందన రావటంలేదని పలువురు వాపోతున్నారు.

- రేడియల్ రోడ్డు–4, రేడియల్ రోడ్డు–5 మధ్యలో రావాల్సిన లింక్ రోడ్డుకు ఓవైపు మిలట్రీ స్థలం అడ్డంకిగా మారటంతో ఆ విషయం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇటీవల కేంద్ర రక్షణ సహాయ మంత్రికి విన్నవించారు.
- ఇటువైపు బీఆర్‌సీ వద్ద లింక్ కలవాల్సిన పనులతో పాటు ల్యాంకో రోడ్డు నుంచి నార్సింగి రోడ్డుకు కలిపేలా మాస్టర్‌ప్లాన్‌లో ఉన్న రోడ్డు పనులను చేపట్టాలని ఇటీవల మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్ ముదిరాజ్ తన అనుచరులతో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. గత వారంలో గండిపేటకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మణికొండలో ట్రాఫిక్, రోడ్ల పనుల ఆవశ్యకతను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తన ప్రసంగంలోనే తెలిపారు. స్పందించాల్సిన హెచ్‌ఎండీఏ అధికారులకు సరైన ఆదేశాలు వెళ్లకపోవటం, వారు ఇటువైపు చూడకపోవటంతో ప్రజలు నిత్యం నరకయాతనను అనుభవిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని మణికొండ మున్సిపల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చేపట్టాల్సిన పనులివీ...

షేక్‌పేట నుంచి ఔటర్‌రింగ్ రోడ్డుకు కలవాల్సిన రేడియల్ రోడ్డు–5 పనులు మధ్యలోనే నిలిచిపోయినా పట్టించుకున్న నాథుడు లేడు.

- లంగర్‌హౌస్–నార్సింగి రేడియల్ రోడ్డు–4 నుంచి రేడియల్ రోడ్డు–5కు బీఆర్‌సీ వద్ద కలవాల్సిన లింక్ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి.
- నార్సింగి మున్సిపాలిటీ పరిధి గీతాంజలి స్కూల్ నుంచి ఫ్రెండ్స్ కాలనీ వరకు, భాగ్యలక్ష్మి కాలనీ నుంచి మర్రిచెట్టు సర్కిల్ వరకు మున్సిపాలిటీ చేపడతామని రోడ్డు వెడల్పు పనులు టెండర్ల ప్రక్రియలోనే నానుతున్నాయి.
- ల్యాంకో జీ సర్కిల్ నుంచి ఔటర్‌కు వచ్చిన కొత్త రోడ్డు మూల మలుపు నుంచి పుప్పాలగూడ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం పక్కకు ప్రతిపాదించిన మరో లింక్ రోడ్డు పనులను పట్టించుకోవటం లేదు.
- ఔటర్ సర్వీసు రోడ్డుకు మణికొండ వైపు నుంచి వచ్చే రోడ్డును ఫ్లై ఓవర్ వేసి ఔటర్ అవతలి వైపు దించితే మైహోం సర్కిల్‌లో ట్రాఫిక్ జాం తగ్గుతుందని ట్రాఫిక్ పోలీసులు పంపిన ప్రతిపాదనలను బుట్టదాఖలయ్యాయి.
- మణికొండ ల్యాంకో జీసర్కిల్ వద్ద సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేసి సంవత్సరం అవుతున్నా ప్రారంభించ లేదు.



ల్యాంకో జీ సర్కిల్ రోడ్డు నుంచి పుప్పాలగూడ వరకు ప్రతిపాదిత రోడ్డు

తప్పని నరకయాతన


అలకాపూర్ టౌన్ షిప్ ప్రజలకు అందుబాటులోకి రావాల్సిన నార్సింగి, మణికొండ ప్రధాన రోడ్లకు కలవాల్సిన లింక్ రోడ్డు సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తికాక ప్రజలు నిత్యం రాకపోకలను నరకం అనుభవిస్తున్నారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. ఒకవైపు మిలట్రీ, మరో వైపు హెచ్‌ఎండీఏ అధికారులు తలచుకుంటే పనులు పూర్తి అవుతాయి. అన్ని ప్రయత్నాలు చేసినా పనులు కాకపోవటం విడ్డూరంగా ఉంది.

– ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధ్యక్షుడు, గ్రేటర్ అలకాపూర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్

రోడ్ల సమస్యే ప్రధానం


మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గతంలో వేసిన రోడ్లు వ్యక్తిగత గృహాల నిమిత్తం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, టవర్‌లు వస్తుండటంతో అవి ఏ మాత్రం సరిపోవటం లేదు. అయినా నిర్మాణాలకు అనుమతులు మాత్రం జారీ చేస్తూనే ఉన్నారు. హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీల అధికారులు తలచుకుంటే తీరే సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. పలుమార్లు వారి దృష్టికి తీసుకుని వెళ్లినా చలనం లేదు. స్థానిక ఎమ్మెల్యే వారి వెంట పడితేనే పనులు జరుగుతాయి.

– అర్వపల్లి వంశీ, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు, మణికొండ

త్వరలో ప్రారంభిస్తాం


మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్ల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది. హెచ్‌ఎండీఏ చేయాల్సిన లింక్ రోడ్ల గురించి వారికి, ఎమ్మెల్యేకు లేఖలు రాశాము. తమ పరిధిలో ఉన్న షేక్‌పేట–నార్సింగి రోడ్డు, మర్రిచెట్టు కూడలి నుంచి భాగ్యలక్ష్మి కాలనీ వరకు ఉన్న రోడ్లను వెడల్పు చేసేందుకు ఇప్పటికే టెండర్‌లు పిలిచాము. త్వరలోనే వాటిని ప్రారంభిస్తాము.

– డి.ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ

ర్యాగింగ్‌తో భవిష్యత్ అంధకారం

నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి


ర్యాగింగ్‌పై అవగాహనలో పాల్గొన్న పోలీసులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

మణికొండ: ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితాలు నాశనం అవుతాయని, భవిష్యత్ కూడా అంధకారం అవుతుందని ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి అన్నారు. గురువారం గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులతో కలిసి యాంటీ ర్యాగింగ్‌పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ర్యాగింగ్ చేయటం ఓ మనిషిని హింసించినట్టేనని, దాన్ని చట్టాలు అంగీకరించవన్నారు. సీబీఐటీ కళాశాల జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తుందని, దాన్ని అలాగే కొనసాగించాలని, అందుకు ప్రతి విద్యార్థి సహకరించాలన్నారు. ర్యాగింగ్‌తో పలు దుష్పరిణామాలు వస్తాయని, వాటితో పోలీసు కేసులలో ఇరుక్కోవటంతో పాటు ఉద్యోగాలు రాకుండా, విదేశాలకు వెళ్లలేని పరిస్థితితో పాటు జైలుకి వెళ్లాల్సి వస్తుందని ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ లింగారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్‌ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ బీఆర్ శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీధర్‌లు ర్యాగింగ్ వలన కలిగే పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో 2, 3, 4వ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు విఫల యత్నం


స్థానికులతో మాట్లాడుతున్న రాఘవేందర్‌యాదవ్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు యత్నించడంతో బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు అక్కెం రాఘవేందర్‌యాదవ్, మైసిరెడ్డి, నాయకులు, కార్యకర్తలతో కలిసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టీఎన్‌జీవోస్ కాలనీకి ఆనుకొని ఉన్న బంజారా బస్తీ వారికి 156 సర్వే నెంబర్‌లో 5.5 ఎకరాల ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కొంత మంది వచ్చి స్థలాన్ని జేసీబీ ద్వారా చదును చేస్తున్నారన్నారు. దీనిని గమనించి వారిని దస్తావేజుల కోసం ప్రశ్నించగా పొందనలేని సమాధానాలు చెప్పారన్నారు. ఇదే విషయాన్ని తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా తెలపడంతో ఆయన ఆ స్థలానికి సంబంధించి ఎలాంటి పర్మిషన్ ప్రభుత్వం ఇవ్వలేదని పేర్కొన్నారన్నారు. దీంతో వారిని అక్కడ నుంచి పంపించి వేశారన్నారు. కబ్జాను కాపాడిన వారిని బంజారా బస్తీ వాసులు అభినందించారు.

బీజేపీ నేత మల్లేష్ సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్: బీజేపీ ఎస్సీ మోర్చా రాజేంద్రనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షుడు తొండుపల్లి మల్లేష్ దశదిన కర్మను రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్‌లో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొండుపల్లి మల్లేష్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పి పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ కలిసి డబ్బులు పోగుచేసి మొత్తంగా రూ. 79 వేలను వారి కుటుంబ సభ్యులకు ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వై.శ్రీధర్, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, నారగూడెం మల్లారెడ్డి, ఎం.కొమురయ్య, జె.రవి, బోనుపల్లి ప్రతాప్, బచగల రమేశ్, కోరని సదానందం, మల్లేష్ యాదవ్, సందీప్ ముదిరాజ్, బండారి బాలకృష్ణ, ఇ.వేణుగోపాల్, భాస్కర్, జ్ఞానేశ్వర్, రఘుమారెడ్డి, రవి, కిరణ్, స్వామి, పెంటయ్య, యాదగిరి, వనితారెడ్డి, సరితారెడ్డి, శశిధర్, మీసాల జంగయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మణికొండ: రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని, విద్యార్థులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రజల ప్రాణాలను రక్షించాలని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం గండిపేటలోని కళాశాలలో జూబ్లిహిల్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ సామాజిక స్ఫూర్తితో రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు జి.విజయలక్ష్మి, జి.అరుణ, మాధవిలతో పాటు పీటీ డాక్టర్ బర్నాబాస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నవజ్యోతి యూత్ అధ్యక్షుడి రాజీనామా

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని నవజ్యోతి యూత్ అధ్యక్ష పదవికి తాను రాజీనామా చేస్తున్నట్టు బి.రవికాంత్ రెడ్డి ప్రకటించారు. ఆయన గత కొన్ని సంవత్సరాలుగా ఆ పదవిలో ఉన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలో పండగలు, క్రీడా ఉత్సవాలను ఇదే యువజన సంఘం నిర్వహిస్తుంది. తనకు బీజేపీ మున్సిపాలిటీ పదవి రావటం, కొత్త వారికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే తన పదవికి రాజీనామా చేశానని తెలిపారు. త్వరలోనే ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకోవాలని సభ్యులను కోరినట్టు ఆయన వెల్లడించారు.

రవికిరణ్ ముదిరాజ్‌కు నివాళి

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్ కుమారుడు రవికిరణ్ ముదిరాజ్ సంతాప సభ గురువారం నిర్వహించారు. ఆయన మరణించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సంతాప కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హాజరై రవికిరణ్‌ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, మహేందర్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, సాగర్‌గౌడ్, సురేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, వేణుగౌడ్, పాపయ్యయాదవ్, సంగారెడ్డి, హరీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

26న కందుకూరులో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: కందుకూరులో ఈ నెల 26 జరగనున్న టీడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్) జిల్లా మూడో మహాసభల కరపత్రాన్ని గురువారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్‌లు తమవంతు పాత్రను పోషించి ప్రభుత్వ సహకారంతో పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఫెడరేషన్ నాయకులకు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు బి.దేవేందర్, నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.గోపాల్, ప్రధాన కార్యదర్శి బుచ్చయ్య, ఉపాధ్యక్షులు ప్రభాకర్, సలహాదారు కోళ్ల యాదయ్య, ప్రచార కార్యదర్శి జ్ఞానేశ్వర్, సహాయ కార్యదర్శి యాదగిరి, సతీష్‌బాబు, మాజీ అధ్యక్షుడు కె. సుదర్శన్‌గౌడ్, ఎం.శ్రీనివాస్, మద్దురు శ్రీనివాస్, విజయ్, సుధీర్‌కుమార్, అనిల్‌కుమార్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్, పి.విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చదువు ఒక్కటే పేదల తలరాత మార్చుతుందని బలంగా విశ్వసిస్తానని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు మనపై ఎంతో విశ్వాసంతో బడులకు పంపిస్తుంటారు. వారి నమ్మకమంతా ఉపాధ్యాయులపై ఉంటుందని అని అన్నారు. ఉపాధ్యాయులు విద్య నేర్పటం వల్లనే తాను ఉన్నతమైన స్థితిలో ఉన్నానన్నారు. కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, ఎంఈవో సునీల్‌కుమార్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, నాయకులు గోకరి సురేష్‌గౌడ్, సాగర్‌గౌడ్, మహేందర్‌గౌడ్, కృష్ణారెడ్డి, పాపయ్యయాదవ్ పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

కాగ్నిజెంట్ అమెరికా అధ్యక్షుడు సూర్య గుమ్మడి


టెక్నాలజీ శిక్షణలో పాల్గొన్న సంస్థల ప్రతినిధులు

మణికొండ: చదువులతో పాటు నైపుణ్యాలు ఉన్నపుడే ఉద్యోగావకాశాలు దక్కుతాయని, గ్రామీణ కళాశాలల విద్యార్థులకు నైపుణ్య శిక్షణతో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ సంస్థ అమెరికా అధ్యక్షుడు సూర్య గుమ్మడి అన్నారు. కోకాపేటలోని ఘర్ టవర్‌లో గురువారం సిటిజన్స్, కాగ్నిజెంట్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల కళాశాలల విద్యార్థులకు టెక్నాలజీ రంగంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణను ప్రారంభించారు. సంస్థ ఉద్యోగులంతా కలిసి ఏర్పాటు చేసిన ఔట్రీచ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత సాంకేతిక రంగంలో ఉపాధి సాధించడానికి అవసరమైన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని కల్పించి ఉమ్మడి కార్యాచరణతో పరిశ్రమ, నైపుణ్యాల మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేస్తున్నామన్నారు. సాంకేతిక ఆధునికీకరణ, డిజిటల్ పరివర్తన, నెక్స్ట్ జనరేషన్ ఆవిష్కరణల కేంద్రంగా ఈ కేంద్రం పనిచేస్తుందన్నారు. సిటిజన్ ఫైనాన్షియల్ గ్రూఫ్ చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారి మైఖేల్ రట్లెడ్జ్ మాట్లాడుతూ... దేశంలో తమ సంస్థ విద్యార్థులకు కొత్త అవకాశాలను అందిస్తుందన్నారు. విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణించేందుకు తాము కృషి చేస్తామన్నారు. శిక్షణలో విద్యార్థులకు ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో అవసరమైన జెనరేటీవ్ ఏఐ గురించి పరిచయం చేస్తారన్నారు. ఉద్యోగ సాధనకు కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, జీవిత నైపుణ్యాలను నేర్పిస్తారన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 4 వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దామన్నారు. వందకు పైగా కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలతో భాగస్వామ్యం ద్వారా తమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.